

కొవ్వొత్తులు వెలిగించి పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు తదితరులు

పహల్గాం మృతులకు నివాళి

కవాడిగూడ, మే 1 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు హత్య చేయడాన్ని నిరసిస్తూ కవాడిగూడ డివిజన్ రోటరీ కాలనీలో బాబుజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాల వద్ద గురువారం కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్, బస్తీ అధ్యక్షుడు బండారు యాదగిరి, నాయకులు కల్వల కుమారస్వామి, ఈటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు

తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలందరూ సన్నబియ్యంతో కడుపునిండా భోజనం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి తెల్లరేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ చేసి లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆజామాబాద్ ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం ముషీరాబాద్, రాంనగర్ సెక్షన్‌ల సిబ్బందికి ఎలక్ట్రికల్ ఆటోను అందజేశారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లేందుకు ఎలక్ట్రికల్ ఆటోను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఏఈలు సునీల్‌రెడ్డి, సుధామా తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి ఎలక్ట్రికల్ ఆటోను అందజేస్తున్న ఏడీఈ వినోద్‌కుమార్



భరత్‌నాయక్‌కు ఆర్థిక సహాయం, నోట్ పుస్తకాలు అందజేస్తున్న పాశం సాయికృష్ణయాదవ్, కె. సురేందర్ తదితరులు

తలసీమియా వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందువరుసలో ఉండాలని అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ సూచించారు. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న అచ్యుతరెడ్డి మార్గ్‌కు చెందిన బాలుడు భరత్‌నాయక్(11)కు గురువారం బీజేపీ నాయకుడు కె.సురేందర్ ఆర్థిక సహాయం, నోటు పుస్తకాలు అందజేశారు. బాలుడికి పార్టీ పరంగా సహకారం అందిస్తామని సాయికృష్ణయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ ఏక్‌మినార్ వద్ద చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులను బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కోరారు. గురువారం సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడు జావిద్ ఖాన్, మైనారిటీ కమిటీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్, నాయకులు మున్వర్‌చాంద్, సమీర్, జునేద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): డీజే మ్యూజిక్ లవర్స్ సింగింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రముఖ గాయనీగాయకులు దొంతి జంగయ్యగౌడ్, మురళీమోహన్, దేవేందర్‌గౌడ్, సుబ్బిరెడ్డి, భీమ్‌రావు, జంగయ్య, రామ్‌మూర్తి, భువన రాధారాణి, ఉషామల్లాది, కామేశ్వరి అలనాటి, ఆధునిక తెలుగు, హిందీ సినీ గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ గాయనీగాయకులను సత్కరించారు. రంగస్థలనటుడు దామోదరం నాగేంద్ర, పి. శ్రీనివాసరావు, రమణాచారి, రాజారావు, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

4న ఉచిత మెగా హెల్త్‌క్యాంప్

బర్కత్‌పుర, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏబీఎస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన ఉచిత మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ జయపాల్‌రెడ్డి తెలిపారు. చిక్కడపల్లి ప్రధాన రోడ్డులో మెట్రోపిల్లర్ 1135 సమీపంలోగల ఆస్పత్రి ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హెల్త్ క్యాంపు కొనసాగుతుందన్నారు. ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, పార్మసీ ఇన్వేస్టిగేషన్‌పై 20 శాతం డిస్కౌంట్ పొందవచ్చని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7416664505 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



భోలక్‌పూర్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, వై.శ్రీనివాస్‌రావు



బాగ్‌అంబర్‌పేట రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో మేడే జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



డప్పులు వాయిస్తూ, కోలాటం ఆడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ కార్యకర్తలు, కార్మికులు

కార్మికులు హక్కులను సాధించుకోవాలి

ముషీరాబాద్, అంబర్‌పేటలో ఘనంగా మేడే వేడుకలు

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ముషీరాబాద్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం 50 మంది పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి తమ న్యాయమైన హక్కులను సాధించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు బింగి నవీన్, రహీం, మహ్మద్ అలీ, శంకర్‌గౌడ్, మైనారిటీ కమిటీ డివిజన్ అధ్యక్షుడు మగ్బూల్, యూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేఎం సాయి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అసోసియేషన్, గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మేడే జెండాను ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రఘు, విఠల్ ప్రసాద్, అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- భరత్ నగర్‌లో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. దశరథ్ మేడే జెండాను ఆవిష్కరించారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్, కమిటీ నాయకులు రమేష్, శంకర్, శ్రీరాములు, ఏకే పాషా, విమల, యూసుఫ్, శివకుమార్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలి

చిక్కడపల్లి: మేడే పోరాట వీరుల స్ఫూర్తితో నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. వీరయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ వైఎంసీఏ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్, గోల్కొండ క్రాస్‌రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు యాజమాన్యాలకు ఊడిగం చేసే బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్మికులు కనీస వేతనం అడిగే హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఈనెల 20న సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, శ్రీనివాస్, అజయ్‌బాబు, కిరణ్‌మయి, రాములు, సత్యనారాయణ, మహేందర్, మోహన్, ప్రసాద్, సుమిత్ర, ఆరోగ్యమ్మ, రమావేణి, రవీందర్, గీత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటఫలితమే మేడే

కవాడిగూడ: కార్మికుల పోరాట ఫలితమే మేడే అని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. దశరథ్ అన్నారు. మేడే పురస్కరించుకొని గురువారం కవాడిగూడ తాళ్లబస్తీ మల్లయ్య హోటల్, కల్పన చౌరస్తా, బీమమైదాన్, బండానగర్, ఇందిరాపార్కు చౌరస్తాలలో ఏర్పాటు చేసిన జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకట్, కమిటీ సభ్యులు కె. రమేష్, శంకర్, వీరాస్వామి, అర్వపల్లి శ్రీరాములు, విమల తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో..

రాంనగర్: వీఎస్టీ కార్మికులకు షిఫ్టింగ్ బెనిఫిట్స్ హామీలు త్వరలో అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆజామాబాద్‌లోని వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సలహాదారు ఆర్‌డీ చంద్రశేఖర్, కె.రాజు, ప్రధాన కార్యదర్శి ఎల్.డి. పాల్, చీఫ్ ఉపాధ్యక్షుడు జి.నాగేష్, కోశాధికారి కృష్ణారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఏఆర్.శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని స్వరాజ్య పార్టీ జాతీయ అధికార ప్రతినిధి యామిని లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం రాంనగర్ చౌరస్తాలో తెలంగాణ బహుళ నిర్మాణ అసంఘటిత కార్మిక చైతన్య సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మేడే పతాకాన్ని ఆవిష్కరించి భవన నిర్మాణ కార్మికులను సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్, స్వరాజ్య పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గోల్కొండ రత్నం, స్వరాజ్య ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న స్వరాజ్య పార్టీ జాతీయ అధికార ప్రతినిధి యామిని లక్ష్మి



కవాడిగూడలో మేడే జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. దశరథ్



వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో మే డే జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి

అడిక్‌మెట్‌లో..

అడిక్‌మెట్ డివిజన్‌లోని బ్రహ్మంగారి ఆలయం వీధిలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రేమలతారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని మేడే జెండా ఆవిష్కరించారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

- గోల్కొండ చౌరస్తాలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. నగర కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.దశరథ్ మేడే జెండాను ఆవిష్కరించారు.
- టీయూసీఐ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. నాయకులు రవీందర్, హన్మేష్, ప్రభాకర్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.
- బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో మేడే జెండాను రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆవిష్కరించారు. వనం సుధాకర్, సుకన్య, శివాజీ, పావని, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో ఈనెల 20న జరిగే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం మేడే జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధానకార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. పద్మ, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.భాస్కర్, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు ఎస్.ఎల్.పద్మ, హన్మేష్ తదితరులు



బాగ్‌లింగంపల్లిలో ఓంకార్‌భవన్‌లో మేడే జెండా ఎగురవేసిన ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి రవి

కులగణనకు కేంద్రం ఆమోదం హర్షణీయం

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని టీడీపీ స్వాగతిస్తుందన్నారు. టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, కిరణ్, నాగు నగేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణాయాదవ్

బహుజన ముక్తి పార్టీ పోరాటాల వల్లనే..

బహుజన ముక్తి పార్టీ చేసిన పోరాటాల వల్లనే కులగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జనగణనలో కులగణన చేసి రాజ్యాంగ ఫలాలను అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన పంచాలని తమ పార్టీ ఉద్యమాలు చేసిందన్నారు.

నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బర్కత్‌పుర: జాతీయ స్థాయిలో కులగణనపై కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నంద కిషోర్‌యాదవ్ అన్నారు. గురువారం కాచిగూడలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టడం వల్ల దేశంలోని బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. యాదవ కులస్థులకు జాతీయ స్థాయి కులగణన మంచి పరిణామమన్నారు. యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి. వెంకటేష్, గోల్కొండ జిల్లా మాజీ అధయక్షుడు పి. పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అంబర్‌పేట: కులగణన చేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదించడం హర్షణీయమని మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ అన్నారు. గురువారం అలీకేఫ్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీలకు మేలు

చిక్కడపల్లి: దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి కేంద్రం అంగీకరించడం హర్షణీయమని టీజేఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ అన్నారు. దీంతో ఓబీసీలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హోటల్ ఉప్మాలో బియ్యం పురుగు

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): హోటల్ ఉప్మాలో బియ్యం పురుగు వచ్చింది. ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళ గురువారం మధ్యాహ్నం చిక్కడపల్లిలోని ఉడిపి సెంటర్‌లో ఉప్మా తీసుకెళ్లారు. తినేందుకు ఉపక్రమించగా అందులో బియ్యం పురుగు కనిపించింది. హోటల్‌కు వెళ్లి వారికి చూపించగా.. తప్పు జరిగిందని ఆ మహిళకు దోశ ఇచ్చారు. మీడియా ఆమెను ప్రశ్నించగా.. ఉప్మాలో పురుగు ఉన్న ఫొటోలను ఫోన్‌లో నుంచి డిలీట్ చేశానని తెలిపారు.

రైలులో చోరీ

- **వృద్ధుడి సెల్‌ఫోన్, ఏటీఎం కార్డుల అపహరణ**

బర్కత్‌పుర, మే 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులను దొంగలు తస్కరించారు. ప్రకాశంనగర్‌కు చెందిన అశోక్‌కుమార్(71) కాచిగూడ రావడానికి బిక్కనూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కామారెడ్డి వద్ద బాత్రూమ్ కి వెళ్లి వచ్చే సరికి దొంగలు అతడి బ్యాగును అపహరించారు. బ్యాగులో ఖరీదైన సెల్‌ఫోన్, బ్యాంకు ఏటీఎం, ఆధార్ కార్డులు, ఇంటి తాళాలు, రూ. 1,200 ఉన్నాయి. అశోక్‌కుమార్ గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప చెప్పారు.

బీడీల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న గోడౌన్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మాణిక్‌రాయ్(50) ఆజామాబాద్‌లోగల దాదు స్వీట్‌హౌస్ గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. గురువారం బీడీలు తెచ్చుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో బంధువు బన్నీ మాలిక్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చిక్కడపల్లి డీఐగా శంకర్

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ డీఐగా ఎం. శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన అంతకు ముందు తుకారాంగేట్ ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు. చిక్కడపల్లి డీఐగా పనిచేస్తున్న ఇ. శేఖర్ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పీఎస్ అదనపు ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 20 మంది లబ్ధిదారులకు రూ. 6,49,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర: హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో 11 మందికి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రంధ్యారాణి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పాల్గొన్నారు.

శ్యామలాదేవికి పూజలు

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశక్తిపీఠం ఉపాసకుడు శక్తి ఆనందస్వామి ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని ఎంసీహెచ్ కాలనీలో గురువారం శ్యామలాదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించి అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న రామకృష్ణ చంద్రమౌళి, పి.బడేసాబ్ తదితరులు

తెలుగు సాహిత్యంలో విస్ఫోటనం శ్రీశ్రీ

నల్లకుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో ఒక విస్ఫోటనం శ్రీశ్రీ అని ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో గురువారం నల్లకుంటలో మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రమౌళి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని శాసించిన కవి శ్రీశ్రీ అని కొనియాడారు. సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్ మాట్లాడుతూ శ్రీశ్రీ అంటే ఒక విప్లవం అని అన్నారు. నర్మద, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల పరిశీలన

అంబర్‌పేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎంసీహెచ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ముఖ్యంగా బాలింతలు డయాలసిస్ పేషెంట్లకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనిచేస్తున్న వారికే పదవులివ్వాలి

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): పదిహేను సంవత్సరాలుగా మున్నూరు కాపుల సంక్షేమానికి పనిచేస్తున్నవారికే మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్, సభ్యులుగా నియమించాలని మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆరె దశరథం, మహేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో కూడా మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు.

పోతరాజు వేషధారి ప్రేమ్‌రాజ్ మృతి

ముషీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పోతరాజు మాన్పడి ప్రేమ్‌రాజ్(52) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. 30 సంవత్సరాలుగా బోనాల ఉత్సవాల్లో పోతరాజు వేషధారణ వేసి పేరు గాంచాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న విజయ యువజన సంఘం నేతలు, వివిధ పార్టీల నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బన్సీలాల్‌పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



ప్రేమ్‌రాజ్ (ఫైల్)